**కథ**

# ఛాన్సు



జి. సరస్వతి

అందరికీ పంచగా మిగిలిన ఒక్క స్వీటుతో రఘురామ్ టేబుల్ దగ్గరకు వచ్చి అతనికెదురుగా కూర్చుని ''స్వీటు తీసుకో రఘురామ్!'' అంది కమల.

''ఏమిటి విశేషం?'' అని అడుగుతూనే లడ్డు తీసి నోట్లో పెట్టుకోబోయి ''నీకులేదే?'' అంటూనే సగం ముక్క ఆమె చేతిలో పెట్టి మిగతాది తను తీసుకున్నాడు.

''మా అక్కకు పెళ్లి నిశ్చయమైంది రఘురామ్!'' అంది కమల.

''అంటే నీకు లైను క్లియరైందన్నమాట!''

''అవును రఘురామ్. మరి స్వీటు పంచుకున్నట్లే జీవితాన్ని కూడా పంచుకుందామా?'' ఉత్సాహంగా, ఆశగా అడిగింది కమల. నవ్వుతూ, తుళ్ళుతూ అందర్నీ ఆటలు పట్టిస్తూ తిరిగే కమలను, ఆమె మాటల్ని ఎవరూ సీరియస్‌గా తీసుకోరు.

''స్వీటు ముక్క ఇచ్చానని అడ్వాన్సయిపోతున్నావే! తమాషాగా వుందా?'' అన్నాడు రఘురామ్ ఉడుక్కుంటున్నట్లుగా మొహం పెట్టి.

''తమాషా కాదు రఘురామ్. సీరియస్‌గానే అడుగుతున్నాను. మనం ఒకేచోట ఉద్యోగం చేస్తున్నాం. ఒకరికొకరం బాగా తెలుసు. పెళ్లి చేసుకుంటే బాగుంటుంది కదూ!''

కమల మనసు అర్థమైంది రఘురామ్‌కి. చక్కని రూపమూ, చలాకీతనమూ, మాటకారితనమూ, మంచి ఉద్యోగం వున్న పిల్ల కమల. కోరి అడిగితే కాదనడం ఎంత కష్టమో, అవుననడం కూడా అంతే కష్టం. ఎందుకంటే ఆడపిల్ల తానుగా ప్రపోజ్ చేయడమనేది తన ఊహకందనిది కాకపోయినా తనకు బొత్తిగా సరిపడనిది. ఒప్పుకుంటే జీవితాంతం తనను కీలుబొమ్మను చేసి ఆడించేస్తుంది. తనకు కావలసింది తన మాట వినే అమ్మయి కాని తనను మాట వినమనే అమ్మాయి కాదు.

కమల అతని జవాబు కోసం ఆత్రుతగా అతని మొహంలోకి చూస్తోంది.

''సారీ కమలా!'' అన్నాడు రఘురామ్ ఆమె చూపుల్ని తప్పించుకుంటూ. పరిచయమైంది మొదలు తనతో ఎంతో క్లోజ్‌గా వుంటున్న రఘురామ్ కాదనేసరికి కమల ఖిన్నురాలైంది.

''నేను నచ్చలేదా రఘురామ్?'' చిన్నబోయి అడిగింది.

''డ్యాషింగ్ నేచరూ, తెలివితేటలు, సమర్థతా వున్న నిన్ను ఫ్రెండుగా అభిమానించగలను, గౌరవించగలను. కానీ భార్యగా చేసుకోలేను కమలా. ఎందుకంటే నేను సంసారపక్షంగా వుండే అమ్మాయిని కోరుకుంటున్నాను.''

''ఆల్ ది బెస్ట్ రఘురామ్!''

''థాంక్యూ.''

స్వీటు ముక్క ఇచ్చి ఆమె నోటిని తీపిచేసిన రఘురామ్ ఆమె మనస్సును మాత్రం ముక్కలుచేసి చేదు మిగిల్చి బైటికి నడిచాడు.

★★★

పసుపు చుక్కలున్న కవరు మోహన్, చేతిలో పెట్టగానే స్టన్ అయిన కమల క్షణంలో తేరుకుని ''కంగ్రాట్యులేషన్స్ మోహన్!'' అంది చిరునవ్వుతో.

''థాంక్యూ!'' అన్నాడు మోహన్ ముక్తసరిగా.

''పెళ్లికొడుకువి కదా. డల్‌గా ఉన్నావేం మోహన్?'' అని అడిగింది కమల.

''రాజీపడి పెళ్లి చేసుకుంటున్నప్పుడు ఉత్సాహం ఎలా వుంటుంది కమలా?''

కమల ఆశ్చర్యంగా అతని వైపు చూసింది.

''అవును కమలా. అప్రస్తుతం, అనవసరం అయినా నా మనసులో మాట చెప్పలేకుండా ఉండలేను. ఏడాదిక్రితం నేను బదిలీమీద ఇక్కడికి వచ్చిన మొదటిరోజున నిన్ను చూడగానే నా మనస్సు స్పందించింది. క్రమంగా మన మధ్య స్నేహం, చనువు పెరిగాయి. నీ డ్యాషింగ్ నేచరూ, కపటంలేని నీ మాట, ప్రవర్తన నన్ను పూర్తిగా ఆకట్టుకున్నాయి. నిస్సంకోచంగా మాట్లాడే నువ్వు పెళ్లి ప్రసక్తి తేవడంలో కూడా చొరవ చూపించి అడుగుతావని ఎన్నాళ్లో ఎదురుచూసాను. కానీ నువ్వెప్పుడూ పెళ్లి ప్రసక్తి తేకపోవడంతో నామీద నీకు ప్రత్యేకమైన ఇష్టంలేదని నిర్ధారించుకున్నాను. మా పెద్దవాళ్ళు వత్తిడి చేయడంతో వాళ్ళు చూసిన సంబంధానికే ఒప్పేసుకున్నాను. నీకు అన్నివిధాలా నచ్చిన వ్యక్తి త్వరలోనే తారసపడాలని మనసారా కోరుకుంటున్నాను. వస్తాను'' ఆమె కళ్లల్లోకి చూడలేక తల త్రిప్పుకుని వెళ్లిపోయాడు.

ఆనాడు కోరుకున్న రఘురామ్ దగ్గర ఛాన్సు తీసుకుని తిరస్కృతికి గురైంది తను. ఆ చేదు అనుభవం పునరావృతం అవుతుందేమోననే అనుమానంతోనే మోహన్ తనకు నచ్చినా అతని ప్రవర్తనలో చూచాయిగా అతని మనసు అర్థమైనా చొరవ చూపలేకపోయింది. అతనే ఛాన్సు తీసుకుని అడిగితే ఒప్పుకోవాలనుకుంది. కానీ అతను తనను కోరుకుని కూడా ఛాన్సు తీసుకోకుండానే దూరమైనాడు. పొంగి వస్తున్న దుఃఖాన్ని ఆపుకునే ప్రయత్నం చేస్తూ టేబులుమీద తల వాల్చింది కమల.

☆